# కాటు

తిరకాసు ఎం.ఎల్.ఎ. అంటే తెలీనివారెవ్వరూ లేరు. ఎన్నికలు ప్రారంభమైంది మొదలు అయిదేళ్ళకోసారి ఎం.ఎల్.ఎ. పదవిని సొంతం చేసుకుంటూనే వున్నాడు. తిరకాసుమీద పోటీచేసి గెలవగల ధైర్యం ఎవ్వరికీ లేదు. పొట్టపొడిస్తే అక్షరం ముక్క రాని తిరకాసుకి రాజకీయాల్లో అమోఘమైన తెలివితేటలున్నాయి.

అన్ని పార్టీలవారికీ కావలసినవాడు తిరకాసు. ఏ పార్టీ పదవిలో కొచ్చినా తిరకాసుకి మంత్రి పదవి ఇస్తామంటుంది. పదవిని అంటిపెట్టుకుని వుండడం, ఓటర్లచేత ఛీ-ఛా అన్పించుకోడం తిరకాసుకి బొత్తిగా ఇష్టం లేదు. పైరవీ చేసి పన్లు అతి సునాయాసంగా చేయించగల దిట్ట! తిరకాసు పేరు చెప్తే చాలు-పసిపిల్లలు ఉగ్గుపాలు తాగడం మానేస్తారు. మామూలు ప్రజలు హడలి ఛస్తారు. ఆ జిల్లాలో ఏ మంచి జరిగినా ఆ ఖ్యాతి తిరకాసుదే! ఏ అన్యాయం జరిగినా దానిక్కారకుడు తిరకాసే అని అందరికీ తెలుసు!

ఆ వూరి కాలేజీకి ఓ చరిత్ర వుంది. బ్రిటిష్ కాలంలో కట్టిన ఆ వూరి డిగ్రీ కాలేజిలో చదువుకున్నవారెందరో గొప్పవాళ్ళయ్యారు; గూండాలూ అయ్యారు.

కాలేజీలు తెరిచే సీజనొచ్చింది!

ఎన్నికల్లో పోటీ చెయ్యాలనే తపనతో పార్టీ టిక్కెట్టుకోసం ఎగబడే రాజకీయ వాదుల్లాగా ఎడ్మిషన్లకోసం విద్యార్థినీ విద్యార్థులు కుప్పలు తెప్పలుగా అప్లికేషన్లు వేస్తున్నారు. సీటొస్తే స్టూడెంట్లకి సరదాదురదా తీరుతుంది. చదువు మాటెలావున్నా రెండు మూడేళ్ళకాలం సజావుగా సాగిపోతుంది.

కష్టపడి చదివే శక్తిగల బ్రిలియంటయితే భవిష్యత్తు మార్గాన్ని నిర్మించుకోగలుగుతాడు. అలా చెయ్యనివాడు వాపోతాడు. కాలేజీలు తెరిచారంటే తల్లితండ్రుల గుండెల్లో గుబులు మొదలౌతుంది. పుస్తకాలు కొనలేక, ఫీజులు కట్టలేక వాళ్ళ చావుకొస్తుంది. మేథ్స్‌వాడికి ఆర్ట్సులో, సైన్స్‌వాడికి కామర్సులో ఎట్టకేలకు సీటొచ్చింది గదాని సంతోషిస్తాడు. ఇష్టం వున్నా లేకపోయినా జాయినవుతాడు. చేరీ చేరకముందే కాలేజీ ఎన్నికల వాతావరణం స్టూడెంట్స్‌ని ఆకర్షిస్తుంది. యూనియన్ ఎన్నికల ప్రచారంతో కాలేజీ గోడలనిండా ఎక్కడ పడితే అక్కడ వివాదాలు మొదలౌతాయి.

రాజకీయాలు జీవితంలో ఓ భాగమైపోయిన నేటి వ్యవస్థలో వాటికి పునాది విద్యాలయాలు కాబట్టి ఎన్నికల వేడి ముమ్మరంగా వుంటుంది. రౌడీయిజం కూడా అప్పుడే మొదలవుతుంది. విద్యార్థి ఎన్నికల్లో లోకల్ రాజకీయ నాయకుల జోక్యం ఎలాగూ వుంటుంది కనుక ఎన్నికల ప్రచారంలో ఎత్తుగడలు, కక్షలు, ప్రతీకారాలు చోటు చేసుకోకతప్పదు. ఈ సంవత్సరం ఛైర్మన్ పదవికి బికాం ఫైనలియర్ విద్యార్థి విజయ్‌కుమార్ పోటీ చేస్తున్నాడనే విషయం విద్యార్థులందరికి తెలిసిపోయింది.

విజయ్‌కుమార్‌తో పోటీచేసి నెగ్గుకు రాగల ధైర్యం ఎవరికీ లేదు. పేరులో వున్న సౌకుమార్యం అతని ప్రవర్తనలో లేదనే నిజం అందరికీ తెలుసు! అయినా సరే అతగాడికి ఓ ప్రత్యర్థి వర్గం విద్యార్థినీ విద్యార్థుల్లో చోటు చేసుకుంది. కాలేజి రౌడీగా పేరు సంపాదించిన విజయ్‌కుమార్‌పట్ల ముఖ్యంగా గర్ల్ స్టూడెంట్స్‌లో అయిష్టం ఏర్పడింది.

అతనికి పోటీగా ఎవర్ని నిలబెట్టాలా అని తీవ్రంగా ఆలోచించిన విద్యార్థి బృందం చివరికి కుల ప్రాతిపదిక చోటు చేసుకున్న కారణంగా చంద్రప్ప పేరును ఖాయం చెయ్యడం జరిగింది.

చంద్రప్ప తెలివైన కుర్రాడు. బి.యస్సీ ఫైనలియర్. అతని దృష్టి ఎప్పుడూ చదువు మీదే. పెద్ద చదువు చదివి గొప్ప ఉద్యోగం చెయ్యాలన్నది చంద్రప్ప నిర్ణయం. రాజకీయాల్లో తలదూర్చడం చంద్రప్పకు బొత్తిగా ఇష్టం లేదు. కానీ తోడివాళ్ళ ప్రోద్భలంవల్ల సరేననక తప్పిందికాదు. పల్లెటూళ్ళో తండ్రి చెప్పులు కుట్టుకుంటూ పొట్టపోసుకుంటున్నాడు. స్కాలర్‌షిప్ తప్పించి తండ్రి చంద్రప్పకు ఏవిధంగానూ సహాయపడలేని పరిస్థితి. హాస్టల్లో వుంటున్న కొడుకుని రెండునెల్లకోమారు వచ్చి చూసిపోతుంటాడు దాసప్ప.

ఛైర్మన్ పదవికి చంద్రప్ప పోటీ చేస్తున్నాడనే విషయం ప్రిన్సిపాల్‌కి, లెక్చరర్లకి తెలిసింది. బ్రిలియంట్ విద్యార్థి అయిన చంద్రప్ప రాజకీయాల్లో తలదూర్చడం వారికి బొత్తిగా ఇష్టం లేకపోవడంతో చంద్రప్పను పిలిచి మందలించారు. చదువు పాడవుతుందని హెచ్చరించారు.

గరల్‌స్టూడెంట్స్ ఓట్లన్నీ ఈసారి చంద్రప్పకే అనే విషయం రూఢి అయింది. విజయ్‌కుమార్‌కి ఈ విషయం తెలిసి పాములా బుసకొట్టాడు. అందరిమీద మండిపడ్డాడు. దీనికితోడు తిరకాసుగారి ముద్దుల కుమార్తె రమణి తనకు వ్యతిరేకంగా ఎన్నికల్లో ప్రచారం చేయడం... తనకొచ్చే ఓట్లని చీల్చాలని చేస్తున్న ప్రయత్నం... చంద్రప్పతో చనువుగా తిరగడం చూసి సహించలేకపోతున్నాడు విజయ్‌కుమార్.

కారుదిగి వస్తున్న రమణివేపు గబగబా నడచివెళ్ళి ''రమణిగారూ! అర్జంటుగా మీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి...'' అన్నాడు విజయ్‌కుమార్.

నొసలు చిట్లించి విజయ్‌కుమార్‌వేపు చురచుర చూసింది రమణి.

''మీరు ఆ చంద్రప్పగాడి పక్షాన చేరి నాకు వ్యతిరేకంగా ప్రచారం చెయ్యడం ఏమీ బాగోలేదు...''

''అది నా ఇష్టం...''

''మీ స్టేటస్ ఎక్కడ... చంద్రప్ప పరిస్థితి ఏమిటి?... మీ నాన్నగారికి తెలిస్తే...''

''ఈ విషయాలు మన కాలేజీకిమటుకే పరిమితం... నాన్నగారికి తెలియాల్సిన అవసరం లేదు.''

''అలా అనకండి రమణిగారూ! మీ నాన్నగారి అండదండలతోనే నేనీ సంవత్సరం ఛైర్మన్ పదవికి పోటీ చేస్తున్నాను.''

''ఎవరి అభిప్రాయాలు వారివి! ఒకరి నిర్ణయాలు మరొకరు మార్చలేరు...''

''అంతేనా? అయితే మరో నిజాన్ని బైటపెట్టవలసి వస్తుంది తెలుసా?''

''ఏమిటది?''

''మీకు తెలీదేం పాపం! అదే ఆ చంద్రప్పగాడితో మీ ప్రేమ వ్యవహారం... అప్పుడే కాలేజీ గోడలవరకు ప్రాకిపోయిన విషయం ఇంకా మీకు తెలీదంటే... ఎలా నమ్మమంటారు?''

''షటప్! పిచ్చిగా వాగకు.'' విజయ్ కుమార్ వాగుడ్ని లక్ష్యపెట్టకుండా ముందుకు సాగిపోయింది రమణి.

ఆమె నిర్లక్ష్య వైఖరి విజయ్‌కుమార్ అహాన్ని మరింత దెబ్బతీసినట్లయింది.

రమణి విషయంలో చంద్రప్ప వర్గం విద్యార్థులు విజయ్‌కుమార్ అనుయాయులతో ఘర్షణపడ్డారు. ఇరువర్గాల మధ్య చిన్న సైజు వార్ జరిగింది. విజయకుమార్ అహం దెబ్బతిన్నది. దెబ్బకు దెబ్బతియ్యాలనే ప్రయత్నంలో రహస్యంగా ఎమ్మెల్యే తిరకాసుని ఆశ్రయించాడు. తిరకాసంటే తాచుపాము. విషయం తెలుసుకున్న తిరకాసు పడగ విప్పాడు. విజయ్‌కుమార్‌ని ఎక్కేసాడు. పథకం ఆలోచించి, తర్వాత బంగళాలోంచి తూలుకుంటూ బైటికెళ్ళిపోయిన విజయ్‌కుమార్ నేరుగా స్టూడెంట్స్ హాస్టల్ వేపు నడిచాడు.

గదిలో లైటు వెలుగుతోంది. చంద్రప్ప శ్రద్ధగా చదువకోవడంలో మునిగిపోయాడు. విసురుగా గది తలుపులు తెరచుకోవడంతో బెదిరిపోయాడు చంద్రప్ప. తాగిన మైకంలో తూగిపోతున్న విజయ్‌కుమార్ ఒక్క వుదుటున పాంటు

జేబులోంచి బటన్‌నైఫ్ బైటికి తీసి చంద్రప్పమీదికి దూకేడు. ఒకే ఒక్క కత్తిపోటుతో గావుకేక పెట్టిన చంద్రప్ప నేలకొరిగేడు. పెద్ద పెద్ద అంగలేసుకుంటూ గదిలోంచి బైటికొచ్చిన విజయ్‌కుమార్ హాస్టల్ ప్రహరీగోడ దూకి చీకట్లో అదృశ్యమైనాడు.

తెల్లారేసరికి చంద్రప్ప మరణవార్త దావానలంలా వూరంతా వ్యాపించింది. విషయం తెలుసుకున్న విద్యార్థులంతా విస్తుపోయారు. ఆ రోజు కాలేజికి శలవుదినంగా ప్రకటించారు. స్టూడెంట్స్ అంతా ఏకమై, చంద్రప్ప మృతదేహాన్ని లారీలో వూరంతా ఘనంగా వూరేగించారు.

★★ ★★ ★★

రూంలో టెలిఫోన్ రింగ్ అవుతోంది!

తిరకాసొచ్చి రిసీవర్ అందుకున్నడు.

''హలో... ఎవరు... విజయ్‌కుమార్ ఫాదరా? ఏమిటి సంగతి? పోలీసులు మీ అబ్బాయిని అరెస్ట్ చేశారా?... సరే! మీరేం వర్రీ అవకండి. విజయ్‌కుమార్ని జామీను మీద నేను విడిపిస్తాను. చంద్రప్పను హత్య చేసిదెవరో... చేయించిందెవరో అంతా నాకు తెలుసు! మీకేం భయం లేదు. మరో అరగంటలో మీ అబ్బాయి ఇంట్లో వుంటాడు-సరేనా?...'' రిసీవర్ హుక్‌మీద వుంచాడు తిరకాసు.

తండ్రి ఫోన్లో మాట్లాడుతున్న విషయాన్నంతా విన్న రమణి నిర్ఘాంతపోయింది.

''నాన్నా! చంద్రప్పవంటి తెలివైన విద్యార్థినీ, అమాయకుడినీ చంపించింది నువ్వా?...'' గద్గదస్వరంతో అంది రమణి.

''అవును చిట్టితల్లీ! నేనే! అదే రాజకీయం!! చూడమ్మా... చనిపోయిన చంద్రప్ప పాపం పూర్ ఫెలో! అలాంటి ప్రత్యర్థివర్గం విజయ్‌కుమార్ వంటి యువనాయకుడికి అడ్డుగా వుండకూడదు. అందుకే విజయ్ నన్ను ఆశ్రయించాడు. ఇందులో తప్పేముంది?...''

ఆ మాట విన్న రమణి గుండె చెరువైంది. నోటమాట కరువైంది.

''నీవంటివాళ్ళు ప్రేమించాల్సింది చంద్రప్పలాంటి చవటల్ని, వెధవల్ని కాదమ్మా!... అందుకే అడ్డు తొలగించాను. నిన్ను రక్షించుకున్నాను...'' గదిలోంచి బైటికెళ్ళిపోయాడు తిరకాసు.

సోఫాలో కుప్పకూలిపోయింది రమణి!

---

★ *(9-6-91 ఆదివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితం)*